# పంటమాలచ్చిమి

-కాకాని కమల

గరటయ్య చేనుగట్టుమీది వేపచెట్టు నీడన కూర్చున్నాడు.

పంట చేల మీదుగా తెరలు తెరలుగా గాలి వీస్తోంది.

తాగిన అంబలి కడుపులో చల్లగా ఉంది.

కాని గరటయ్య మనసు మాత్రం మంటగా ఉంది.

ఎదురుగా పంటమాలచ్చిమి మనిషెత్తు ఏపుగా పెరిగి గాలికి బరువుగా ఊగుతోంది. పాలుపోసుకుంటోన్న కంకులు ఇపుడిపుడే గట్టి పడుతున్నాయి. సంకురాత్రికి కోతకి వస్తాయి.



"నిరుటికంటే ఈఏడు పంట మరో పది పుట్లు ఎక్కువ దిగుబడి అవుతుంది" అనుకున్నాడు గర్వంగా గరటయ్య తన వరిపొలాన్ని చూసుకొంటూ. కాని ఎందుకో గరటయ్య మనసుకి ఉండవలసిన సంతోషం లేదు.

ప్రతిఏటా పంటమాలచ్చిమి చేతికి వచ్చే వేళ్టికి అల్లుడు ఏదో మెలికపేచీ పెట్టుకొని పెళ్ళాన్ని పుట్టింటికి తరుముతున్నాడు.ఏదో వంకన గరటయ్య ఏడాదంతా కష్టపడి పండించుకున్న పంటడబ్బుల్లో అంతో ఇంతో గుంజుకుంటున్నాడు.

కూతురు సీతాలక్ష్మి ముఖం చూసి గరటయ్య ఏమీ చెయ్యలేక ఏటా అల్లుడికి పంట డబ్బుల్లో అంతో ఇంతో ముట్ట చెప్పకతప్పటం లేదు.

సీతాలక్ష్మి నల్గురు కొడుకుల మధ్య అపురూపంగా పుట్టిన ఆడపిల్లనీ, అన్నీ ఘనంగానే అల్లుడు అడిగిన దానికంటే ఎక్కువే చేశాడు.

అయినా తృప్తిపడటం లేదు అల్లుడు.

అల్లుడి సంగతి సరే.

వియ్యంకుడు భద్రయ్యా, వియ్యపురాలు సూరమ్మ కూడా అలాగే ఉండటం (కొడుక్కి పురెక్కించటం చూస్తే) గరటయ్యని బాధిస్తున్నాయ్.

కూతురు డిగ్రీ చదువుకుంది. చక్కని చుక్క. బోల్డంత కట్నం ఇచ్చి బంగారం పెట్టి పెళ్ళి చేశాడు. అల్లుడు పశువుల డాక్టరు. కానీ తానే పశువులా ప్రవర్తించటం అసహ్యంగా ఉంది.

అతనికంటే రెండాకులు ఎక్కువ చదివిన వాళ్ళు తల్లితండ్రులు. గరటయ్య కొడుకులు ఏడాదంతా రెక్క-లు విరుచుకుని పగలనకా రాత్రనకా కష్టపడీ పంటని వేయికళ్ళతో కాపాడు కుంటూ పొలం పని చేస్తున్నారు.

ఏడాది చివరలో కష్టానికి తగిన ఫలితాన్నీ, రెట్టింపు

దిగుబడిని కళ్ళ చూస్తున్నారు.

ఏడాది చివర్లో మంచి ఫలితమే వస్తోంది.

ఖర్చులుపోను అంతో ఇంతో చేతిలో మిగులుతోంది.

ఇల్లు బాగుచేయించుకుందామనో లేక ఆ ఏడాది బ్యాంకు లోను చెల్లుచేసి అప్పు లేకుండా గడపుకొద్దామనో, ఏ పంటకోత మిషనో కొందామనో ఆలోచిస్తుంటే... అల్లుడు గెద్దలా ఆ మిగిలిన సొమ్ముతన్నుకొని పోతుంటాడు.

ఇది ఇప్పుడు కొత్తగా జరుగుతున్నదేం కాదు.

సీతాలక్ష్మి పెళ్ళయిన దగ్గర్నుంచీ ఇదేతంతు. పెళ్ళయిన మొదటిసంవత్సరం అల్లుణ్ణి పండక్కి పిలిచి కొత్త బట్టలూ, ఉంగరం పెట్టారు. కాని తనకి మోటారు సైకిల్ కావాలని తల్లిద్వారా చెప్పించాడు.

మోటారు సైకిల్ అంటే ముప్పైవేలు.

అయినాసరే. ఒక్కగానొక్క అల్లుడని మొహమాటంతో మనసులో బాధ అనిపించినా మోటార్ సైకిల్ కొనిచ్చారు.

'మా చుట్టుపక్కల ఊళ్ళన్నింటికీ నీ అల్లుడు ఒక్కడే పశువుల డాక్టరు. ఎడ్లబండి మీదా, రిక్షాలమీద వెళ్ళలేక పోతున్నాడు. ఇప్పుడు మీరిచ్చారు గనక రేపట్నుంచి ఈ మోటారు బైకమీద హాయిగా తిరుగుతూ ప్రాక్టీస్ చేసుకుంటాడు. అప్పుడప్పుడూ నీ కూతుర్ని కూడా పట్నం తీసుకెడతాడులే" అన్నాడు వియ్యంకుడు భద్రయ్య.

అప్పుడు సంబర పడ్డాడు గరటయ్య.

వియ్యంకుడు తనంత ధనవంతుడు కాదుకదా అని సరిపెట్టుకున్నాడు.

కాని రెండవ సంవత్సరం సంక్రాంతి పండగ ముందు వరిపొలం కోతకివచ్చి కుప్పనూర్చే సమయానికి సీతాలక్ష్మి ఏడుస్తూ పుట్టింటికి వచ్చింది.

భర్త కొడుతున్నాడట. అత్త ఆరళ్ళు భరించలేకుండా ఉందిట! కారణం అల్లుడు కలర్ టీ.వీ మీద మోజు పడ్డాడట. ఊళ్ళో అంతా కలర్ టీ.వీలు కొన్నారట.

"ఒక్కగానొక్క కూతురివి. మీ నాన్న ఆ మాత్రం కొనియ్య లేడా?" అంటూ పుట్టింటికి తరిమిందిట అత్త!

గరటయ్యకి పిచ్చికోపం వచ్చింది. తామసంగా కూతుర్ని వెంటపెట్టుకు వెళ్ళి అల్లుడి ఎదురుగానే వియ్యంకుణ్ణి సూటిపోటి మాటలనీ వచ్చేశాడు. కాని తన్నినబంతిలా తన బండి వెనకాలే కూతురు వచ్చింది.

వాళ్ళంత శత్రువుల్లా కాల్చుకుతింటున్నారట. భర్త కొడుతున్నాడట.

"వాళ్ళ మధ్య బతకలేకుండా ఉన్నాను. ఇక్కడే ఉండిపోతాను లేదా చావనన్నా చస్తాను" అని కళ్ళమ్మట నీళ్ళెట్టుకుంది.

"ఇదెక్కడి అప్రతిష్టయ్యా! ఒక్కగానొక్క కూతురి పెళ్ళి చేసింది మొగుణ్ణి ఒదిలేసి ఇంట్లో పెట్టుకొంకుకా?" అంటూ గరటయ్య పెళ్ళాం సాధింపు మొదలెట్టింది.

చేసేది లేక కలర్‌టీ.వీతో సహా కూతుర్ని అత్తారింట్లో ఒదిలేసి వచ్చాడు గరటయ్య.

అప్పటికే కూతురు నెల తప్పింది. మిగతా విషయాల మాటెలా ఉన్న ఇది తప్పనిసరి ఖర్చు. నిజానికి గరటయ్య ఆర్థిక పరిస్థితి బాగాలేదు.

అయినా మొదటిసారి కదా అని ఘనంగా సారిపెట్టి కూతుర్ని తెచ్చి పట్నంలో పురుడు పోశాడు. ఏలోటూ లేకుండా బాలసారె జరిపించి కూతుర్ని అత్తింట్లో దింపి వచ్చాడు.

మనసులో దిగులుగానే ఉంది. అల్లుడు మళ్ళీ ఏం మడతపేచీ పెడ్తాడోనని.

కాని ఏ గొడవా లేకుండా అంతా ఆదరించారు. వియ్యంకుడు మనవణ్ణి చూసుకుని మురిసిపోయాడు.

"అమ్మయ్య" అని తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు గరటయ్య. చూస్తుండగానే ఆరునెల్లు గడిచిపోయాయి.

ధనుర్మాసం ఆరంభం అయ్యింది.

ఎక్కడ చూసినా సంక్రాంతి సంబరాల సందడి మొదలయ్యింది. గరటయ్యకీ, కొడుకులకీ, చేతినిండా పనే!

పదిహేను ఎకరాల పైచిలుకు పొలంతో పంటలక్ష్మి ఘల్లుఘల్లు మంటూ, పచ్చగా బంగారం ముద్దలా బరువెక్కిన కంకులతో ధాన్యరాసి వెన్నాలు ఊగిస్తూ గాలికి కదులుతుంటే ఏడాదంతాపడిన శ్రమంతా మరిచిపోయారు గరటయ్య కొడుకులు.

ఆ ఊరి మొత్తంలో ఆ ఏడు గరటయ్య పొలమే ఎక్కువ ధాన్యం దిగుబడి చేసింది. నిరుడికంటే పదిపుట్లు ఎక్కువే ఉంటుందని అంచనా వేసుకున్నారు.

పొలాన్ని కంటిపాపలా కాపాడుకుంటూ ఆధునిక పద్ధతిలో చేసిన సేద్యం మరి. మంచి అదనుచూసి పంటను కొయ్యటానికి అన్నీ సిద్ధం చేసుకుని కూలీలను మాట్లాడుకున్నారు.

ఏడాదికి తిండికి సరిపడా ధాన్యం గింజలు పురి కట్టించి, మిగతావి కళ్ళంలోంచే షావుకారు ఇంటికి తరలించాలని నిర్ణయించుకున్నారు.

పట్నంలో ధాన్యం వ్యాపారంచేసే షావుకారు కనకయ్య స్వయంగావచ్చి గరటయ్య పొలంచూసి సంతోషంతో "ఇవ్వి రాజనాలు కాదయ్యా రతనాలు" అని పొగుడుతూ అప్పటికప్పుడు జేబులోంచి డబ్బు తీసి గరటయ్యకి బయానా కూడా ఇచ్చేశాడు.

ఏడాదంతాపడ్డ కష్టం మరిచిపోయి హాయిగా కునుకు తీద్దామని మంచం మీద వాలిన గరటయ్య పీడకల కన్నట్లు త్రుళ్ళి పడ్డాడు.

కారణం...

సీతాలక్ష్మి కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ చంకలో బిడ్డతో పుట్టింటికి వచ్చింది.

"తొలిచూలు మనవడి 'బిచ్చపోణ్ణి' పంపినట్లు పంపారు. చేతులకి నాలుగు తులాలు తక్కువకాకుండా మురుగులూ, మొలనిండా మామిడిపిందెలతో బంగారు మొలతాడూ మీ నాన్నని చేయించమను. లేకపోతే గుమ్మం తొక్కనిచ్చేది లేదు" అని అత్తామామలు ఖచ్చితంగా చెప్పారట.

"అమ్మా నాన్నా ఏది చెప్తే అదే నా నిర్ణయం!" అంటూ జబ్బ పట్టుకుని తోశాడట భర్త.

ఆ తోపుకి మండుతున్న పొయ్యిమీదపడి చీర కుచ్చెళ్ళు అంటుకున్నాయట.

బొబ్బలెక్కి కమిలిపోయిన కాళ్ళని చూపించి వెక్కి వెక్కి ఏడ్చింది సీతాలక్ష్మి.

ఒడిలో పసిబిడ్డతో సీతాలక్ష్మి పుట్టిల్లుచేరి రెండు నెల్లు అయ్యింది.

ఇంతవరకు అల్లుడి దగ్గర్నుంచి కబురు లేదు.

గరటయ్య వెళ్ళలేదు.

అసహ్యంగా ఉంది. ఎటూ పాలుపోవటం లేదు.

గరటయ్య కొడుకులూ, కోడళ్ళూకూడా విసుక్కుంటున్నారు.

నిజమేమరి. ఏడాది పొడుగునా రెక్కలు విరుచుకుని పొలంపని చేసేది వాళ్ళు. ఏడాది చివర్లో ఫలితాన్ని గెద్ద తన్నుకు పోయినట్లు తన్నుకు పోతున్నది అల్లుడు. అలాగని కూతురు ఏడుస్తూంటే చూడగలడా? దాని సంసారం చుట్టుబండలై పోతూంటే ఊళ్ళో తలెత్తుకుని తిరగ్గలడా?

పొలంగట్టుమీద కూర్చొని ఎదురుగా ధాన్యలక్ష్మిని చూస్తుంటే సంతోషం కలగటం లేదు గరటయ్యకి. రేపు కుప్పనూరుస్తున్నారు.



పేకాట

"మన గుమస్తాలు పేకాడి ఇప్పుడే నిద్రపోయారండీ" ప్యూన్ ఆఫీసర్‌తో చెప్పాడు.

"పేకాట ఆడుతుండగా ఎందుకు చెప్పలేదూ"

"నా హేండ్ రైజింగ్ ఉందండి. డబ్బులు పోతాయని చెప్పలేదు."

-నూతికట్టు రవి
65-16-17, ద్వారకానగర్,
కాకినాడ-3.

రేపు పంట షావుకారింటికి తరలిపోతుంది. పంట డబ్బు చేతికి వచ్చేది కూడా రేపే.

"తప్పేదేముంది? మళ్ళీ ఓ ఐదారువేలు ఖర్చుపెట్టి మనవడికి బంగారు నగిషీలు చేయించి అల్లుణ్ణి పండక్కి పిలిచి బట్టలు పెట్టి పంపిస్తే సరి. మిగతా డబ్బుతో బ్యాంకులో ఉన్న పాతనగలు విడిపించి కోడళ్ళకిస్తే సరి. కోడళ్ళు పెట్టుకుంటారు. పాతదైనా కొత్తదైనా బంగారం బంగారమేకదా!" అంది గరటయ్య భార్య వరమ్మ.

గరటయ్య 'ఉ' అనలేదు. 'ఆ' అనలేదు. అల్లుడి వ్యవహారం రోతగా ఉంది. లేకిగా ఉంది. కొడుకులూ కోడళ్ళ ముఖం చూడాలంటే సిగ్గని పిస్తోంది.

అలా అని కూతుర్ని కాదనలేక పోతున్నాడు.

కోర్టుకెక్కితే మాత్రం ఒరిగేదేమిటి? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది.

అక్కడికీ దిక్కుతోచక ఊరి ప్రెసిడెంటుగారితో అల్లుడి వ్యవహారం, వియ్యంకుడి ధోరణీ గురించి చెప్పుకున్నాడు.

"ఇలాంటి ఇంటి విషయాల్లో మధ్యవర్తి ఉండ కూడదు గరటయ్యా. అల్లుడిది చిన్నతనం. ఇద్దరు పిల్లలు పుట్టేదాకానే ఈ అలకలూ, ఆగడాలూ. తరవాత బాధ్యత తెలుసొస్తుంది. అయినా అటువైపు వెళ్ళినపుడు నీ వియ్యంకుడికి నచ్చచెపుతాలే. ఈసారికి ఏదో మనవడికి ముచ్చట చేసి పంపించెయ్యి." అన్నాడు ప్రెసిడెంటు.

"మా అందరికి మాత్రం లేవా ఇలాంటి బాధలు. ఏదో పొలంపుట్రా ఉన్న మావగారివికదా అనీ, పైగా ఒక్కర్తే కూతురనీ, అల్లుడుగారాలు పోతున్నాడులెద్దూ" అని కూడా అన్నాడు.

ఆ రాత్రంతా గరటయ్యకి కలతనిద్ర.

ఆ మర్నాడు పొద్దుపైకి వస్తూంటే ముల్లుగర్ర ఝుడిస్తూ పుంతదారిగుండా పొలం బయలుదేరాడు.

అంతలో ఎవరో కేకేసి నట్లయి వెనక్కి తిరిగాడు. అల్లంత దూరాన గురివెంత తీగల మాటున సీతాలక్ష్మి. పరిగెత్తి వచ్చినట్లు ఆయాసంతో ఒగరుస్తోంది.

"నువ్వా తల్లీ?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవున్నాన్నా! నేను నీతో మాట్లాడాలి. ఇంట్లో కుదర టం లేదు అందుకే."

శ్రావణమేఘంలా ఉన్న కూతురిముఖం చూడగానే గరటయ్య మనసు కలవర పడింది.

మనవడి సొమ్ముల విషయంలో తను వెనుకాడటం, భర్త పోరుపెట్టటం, కోడళ్ళు ముఖం తిప్పుకోవటం, అంతా గమనించి 'ఈసారి నా ముఖం చూసి నా కాపురం చక్కదిద్దు నాన్నా' అని చెప్పుకోటానికి వచ్చినట్లుంది పిచ్చితల్లి. కాని తను డబ్బు కోసం చూడటం లేదు అల్లుడి లేకి బుద్ధికి అసహ్యించు కుంటున్నాడు.

"నాన్నా"

అన్యమనస్కంగా ఉన్న గరటయ్య ఉలిక్కిపడ్డాడు.

"ఆ..."

"నాన్నా పంటడబ్బు చేతికి వచ్చింది కదూ?"

"అవును తల్లీ... పట్నం వెళ్ళి మనవడికి బంగారం కూడా కొంటున్నాను."

సీతాలక్ష్మి తల అడ్డంగా తిప్పింది.

"ఒద్దునాన్నా. ఆ విషయం చెప్దామనే వచ్చాను."

"అమ్మా సీతా."

"అవును నాన్నా. మీ అల్లుడు పశువులకి వైద్యం చేస్తాడు. మీ అల్లుడు పశువులాంటి మనిషి. డబ్బుకి గడ్డి కరుస్తాడు. పెళ్ళయిన ఈ నాలుగేళ్ళలో నన్ను ఏనాడూ ప్రేమగా చూడలేదు నాన్నా! నీ పొలం, ఇల్లూ అన్నీ వాళ్ళ వశం అయ్యేదాకా నన్ను ఇలాగే కాల్చుకు తింటాడు."

"అమ్మా."

"అవును నాన్నా. ఇన్నాళ్ళూ అభిమానపడి మీకు చాలా విషయాలు చెప్పలేదు. మీ అల్లుడికి లేని వ్యసనం లేదు. పట్నంలో గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారు. చిన్నిల్లు కూడా సెటప్ చేశాడు. మా అత్తా, మావలకి తెల్సికూడా మందలించలేదు."

గరటయ్య నిర్ఘాంతపోయాడు.

"ఈ విషయం అమ్మకి తెలిస్తే దిగులు పడుతుం దనీ, ఒదినలు హేళన చేస్తారనీ కడుపులోనే దాచుకున్నాను. కాని ఈసారి నేను పుట్టింటికి వచ్చింది మళ్ళీ వెళ్ళటానికి కాదు నాన్న. నీ చేయూత ఉంటే నా బతుకు నేను బతుకుతాను. నా బిడ్డని రాజాలా పెంచుకుంటాను."

"అంటే?"

"అన్నయ్యల్తో సమంగా నన్నూ పట్నంలో పెట్టి చదివించావు. వాళ్ళు అగ్రికల్చర్ బిఎస్సీ చదివితే నేను హోమ్‌సైన్స్ డిగ్రీ చదువుకున్నాను.

మన ఊరి చివర చాలా బంజరు స్థలాలున్నాయి. మన ఊరి ప్రెసిడెంటుగారి సహకారంతో పది ఎకరాలు అద్దెకి తీసుకుని స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీ పెడదామనుకుంటు న్నాను.

ఇప్పుడు ప్రభుత్వం ఇలాంటి విషయాల్లో ఆడవాళ్ళకి సహకరిస్తోంది. ఇదిగో నేను వాళ్ళకి అప్లై చేసి శాంక్షన్‌కూడా సంపాయించు కున్నాను.

చీరల అద్దకం, రోలింగ్ సెంటర్ పెడదామను కుంటున్నాను. పట్నం నుంచి ఆర్డర్లు సంపాయించు కుంటాను.

నువ్వు ఒప్పుకోకపోతే పట్నంలో నా స్నేహితురాలు కాన్వెంటు నడిపిస్తోంది. అక్కడ ఏదో పని చూసుకుంటాను. అంతేగాని నేను తిరిగి నీ అల్లుడి దగ్గరకి మాత్రం వెళ్ళను."

ఆమె కంఠంలో తిరుగులేని నిర్ణయం.

"నాదేముంది తల్లీ... కానీ ఊళ్ళో తలెత్తుకుని..."

"అవన్నీ వదిలేయి నాన్నా. రోజులు మారాయి. నా కష్టం ఊళ్ళో వాళ్ళు చూశారా? నా మానసిక క్షోభ ఊళ్ళో వాళ్ళు అనుభవిస్తున్నారా? వాళ్ళ గురించి మనం ఎందుకు ఆలోచించాలి? నాలాంటి ఆడపిల్లలకి నేను మార్గదర్శకం అవుతాను."

కూతురు ఆలోచన గరటయ్యకి నచ్చింది. కాని ఆ మాట ఒప్పుకోవడానికి ధైర్యం చాలటం లేదు.

"ఏమిటి నాన్నా జవాబు చెప్పవ్?"

"అన్నయ్యల్తోకూడా ఒకసారి ఆలోచిద్దాం తల్లీ. ముందు నువ్వు ఇంటికెళ్ళు. స్థలం ఇవ్వటానికి ప్రెసిడెంటు గారు కూడా ఒప్పుకోవాలి కదా!"

"ఆయన తల్చుఉంటే అదెంత నాన్నా. అవన్నీ మున్సిపాలిటీ కింద ఉన్నాయికదా?"

"సరే నువ్వు వెళ్ళు నేను ఆ విషయాలు కనుక్కొం టాను" కూతుర్ని పంపి గరటయ్య పొలం గట్టుకి వచ్చి కూర్చున్నాడు.

మగపిల్లల్తోపాటు కూతుర్ని పట్నంలో చదువుకి పెట్టి నప్పుడు ఊళ్ళో అంత తలా ఒకరకంగా అన్నారు.

"ఆడపిల్లకి అంత చదువెందుకు? పెళ్ళి చేసి పంపిం- చెయ్యక" అంటూ సలహా ఇచ్చారు."

"కాలం మారింది ఆడపిల్లలకి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఎవరి బతుకు వాళ్ళు బతికే స్థానాల్లో ఉండాలి.' ' అని వాదించాడు గరటయ్య ఆనాడు.

ఇప్పుడు నిజంగానే తన కూతురికి కష్టం వచ్చింది. దాని బతుకు అది బతుకుతానంటోంది. ఆ బంజరు భూమి ఇప్పిస్తే ఇండస్ట్రీ పెట్టుకుంటుందిట! ప్రభుత్వం సహాయం చేస్తుందిట.

అల్లుడు బుద్ధి తెచ్చుకొని దారికి వచ్చాడా సరే. లేకపోతే తన కూతురు తనకి బరువుకాదు. అసలు తన కూతురికి ఏం తక్కువై అయ్యిందని పట్నంలో చిన్నిల్లు పెట్టాడు! అవన్నీ కోర్టు ద్వారానే తేలుస్తాను.

గరటయ్య ఆలోచిస్తున్నాడు.

"నాన్నా! నువ్వు నిజంగా నా సుఖం కోరుకుంటే నాకు అండగా నిలుబడు." కూతురు మాటలు జ్ఞాపకం వచ్చి చివాలున లేచి...

. చేతిలో ముల్లుగర్ర టకటకా నేలనితాడిస్తూ పెద్ద పెద్ద అంగల్తో చేలగట్ల మీదుగా నడుస్తూ గ్రామ ప్రెసిడెంటు ఇంటివైపు దారితీశాడు గరటయ్య.

కాకాని కమల
ఫ్లాట్ నం. 15, బ్యాంక్ కాలనీ,
లలిత నగర్,
హైదరాబాదు - 44.